క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

పెదగంట్యాడ: పాలవలస 11కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో ఈ నెల 15న పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఈఈ బీకే నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా మద్దివానిపాలెం, నమ్మిదొడ్డి, ఇస్లాంపేట, దేవాడ, అప్పికొండ, లక్ష్మీనగర్, శ్రీరామ్‌నగర్, మురుభాయ్, పాలవలస, గొల్లపేట, ఈసరపువానిపాలెం, యలమంచిలి దొడ్డి, గిన్నెవానిపాలెం, నక్కదొడ్డి తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు గమనించాలని సూచించారు.

కొత్త పింఛన్ల పంపిణీ



పెన్షన్ అందిస్తున్న రమణబాబు

అగనంపూడి: అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వం పింఛన్లు అందిస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి నక్కా రమణబాబు అన్నారు. 85వ వార్డు బీసీ కాలనీలో కొత్తగా మంజూరైన పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ నక్కా నాయుడు, సత్యనారాయణ, తెలుగుల స్వాతి, గృహ సారథులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి అగనంపూడి చాంపియన్స్ లీగ్

అగనంపూడి: విశాఖ ఉక్కు స్టేడియంలో ఈ నెల 15వ తేదీ నుంచి మూడు రోజుల పాటు అగనంపూడి చాంపియన్స్ లీగ్ క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు దాసరి త్రినాథ్ తెలిపారు. వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని నిర్వహిస్తున్న ఈ పోటీలను జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.శివశంకర రావు ప్రారంభించనున్నారని తెలియజేశారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

కూర్మన్నపాలెం: కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గాజువాక మండల స్థాయి క్రీడా పోటీలు రెండో రోజుకు చేరుకున్నాయి. బాలుర అండర్–14 విభాగం ఖోఖో పోటీల్లో అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హైస్కూల్, కబడ్డీ పోటీల్లో గాజువాక జెడ్పీ హైస్కూల్, త్రోబాల్ పోటీల్లో కణితి జెడ్పీ హైస్కూల్, షటిల్‌లో మిందిఉన్నత పాఠశాల, టెన్నికాయిట్ పోటీల్లో అరబిందో పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. బాలుర అండర్–17 విభాగంలో కబడ్డీ, త్రోబాల్ పోటీల్లో కణితి జెడ్పీ హైస్కూల్, ఖోఖో, షటిల్ పోటీల్లో అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హైస్కూల్, వాలీబాల్ పోటీల్లో విశాఖ విమల విద్యాలయం విద్యార్థులు గెలుపొందారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సూర్యప్రకాశరావు, పీడీ మన్నాజీ, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష'

- 15 రోజుల పాటు ఇంటింటా సర్వే
- ప్రజల ఆరోగ్య సమాచారం సేకరించనున్న సిబ్బంది
- ఈ నెల 30 నుంచి ఆరోగ్య శిబిరాలు

గాజువాక: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై సంబంధిత అధికారులు, సిబ్బంది శుక్రవారం నుంచి సర్వే చేపట్టనున్నారు. జీవీఎంసీ గాజువాక జోన్ పరిధిలోని 14 అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (యూపీహెచ్‌సీ) పరిధిలో ఈ సర్వేను రెండు వారాల పాటు నిర్వహించనున్నారు. దీనికోసం రెండు బృందాలను నియమించారు. జోనల్ కమిషనర్, రెవెన్యూ అధికారి, యూసీడీ ఏపీడీతో ఏర్పాటైన బృందం ఏడు యూపీహెచ్‌సీలలో సర్వేలను.. సహాయ ప్రజారోగ్యాధికారి, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ, డీఈలతో ఏర్పాటైన బృందం మరో ఏడు యూపీహెచ్‌సీల పరిధిలో సర్వేలను పర్యవేక్షించనున్నాయి.

ఈ బృందాల్లో వలంటీర్లు, ఏఎన్‌ఎంలు, పీహెచ్‌సీల ఆరోగ్య విస్తరణాధికారులు సభ్యులుగా ఉంటారు. ఈ సిబ్బంది అన్ని వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి నివాసుల ఆరోగ్య సమాచారాన్ని సేకరిస్తారు. సుమారు తొమ్మిది అంశాలపై సర్వే బృందాలు సమాచారాన్ని సేకరిస్తాయి. ప్రజలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలను ఆన్‌లైన్‌లో యాప్ ద్వారా నిక్షిప్తం చేస్తారు. దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలు, బాలింతల ఆరోగ్య సమాచారం, గర్భిణులకు అవసరమైన వైద్య సహాయం, అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రికి వెళ్లలేనివారి వివరాలను నమోదు చేసి వారికి టోకెన్లు అందజేస్తారు. ఈ నెల 30 నుంచి అక్టోబర్ 11వ తేదీ వరకు నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో ఆ టోకెన్లను చూపించి అవసరమైన వైద్యాన్ని పొందవచ్చు. ఆ శిబిరాల్లో రోగులను పరీక్షించిన వైద్యులు అవసరమైన వారిని మెరుగైన వైద్యం కోసం రిఫరల్ ఆస్పత్రులకు సిఫార్సు చేస్తారు. గాజువాక జోన్‌లోని అన్ని యూపీహెచ్‌సీల పరిధిలో ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్టు జోనల్ కమిషనర్ పి.సింహాచలం వివరించారు.

గాడిచర్ల సేవలు చిరస్మరణీయం

గాజువాక: స్వాతంత్ర్య సమరయోధుడు, గ్రంథాలయ ఉద్యమకారుడు గాడిచర్ల హరి సర్వోత్తమ రావు సేవలు చిరస్మరణీయమని గాజువాక గ్రంథాలయాధికారి బి.చంద్రకళ అన్నారు. గాజువాక శాఖా గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన సర్వోత్తమరావు జయంతి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో గాడిచర్ల కీలక భూమిక పోషించారన్నారు. వందేమాతరం గీతం ప్రచారానికి, వయోజన విద్యాభివృద్ధికి ఆయన ఎనలేని సేవలు అందించారన్నారు. సమావేశానికి ముందు గాడిచర్ల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ గ్రంథాలయంలో..

పెదగంట్యాడ: గాడిచర్ల జయంతిని పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సాహిత్య సుధ వ్యవస్థాపక అధ్యక్షుడు అద్దంకి రాఘవాచార్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ అధికారి పి. వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పాఠకులు పాల్గొన్నారు.



గాజువాక గ్రంథాలయంలో గాడిచర్ల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పాఠకులు

రోగులకు మెరుగైన సేవలే లక్ష్యం

అగనంపూడి: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వం సంకల్పమని ఎమ్మెల్యే, అగనంపూడి ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ తిప్పల నాగిరెడ్డి అన్నారు. ఆస్పత్రికి వచ్చే ప్రతీ రోగికి పూర్తిస్థాయిలో వైద్యం అందించాలని సూచించారు. సమావేశ మందిరంలో నిర్వహించిన ఆస్పత్రి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆస్పత్రిలో వసతుల కల్పన, సౌకర్యాలు మెరుగుపరచడం కోసం నిధులు కేటాయిస్తామన్నారు. మరమ్మతులు, ఇతర కారణాలతో రోగులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. అవసరమైన కంప్యూటర్లు, ప్రింటర్లు, మెటీరియల్స్, ఇతర సామగ్రి, ఫర్నిచర్ కొనుగోలుకు నిధులు కేటాయించినట్లు చెప్పారు. అనంతరం పలు అంశాలపై చర్చించి తీర్మానం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జె.భారతి, గాజువాక జోనల్ కమిషనర్ పొందూరు సింహాచలం, ఆర్‌ఎంవో డాక్టర్ ఉష, నర్సింగ్ సూపరింటెండెంట్ హేమలక్ష్మి, కమిటీ ప్రతినిధులు నక్కా కల్యాణి రమణబాబు, గొలగాని శ్రీను, దానబాల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతోనే పోషకాహారం

అక్కిరెడ్డిపాలెం: తక్కువ ఖర్చుతో ఎన్నో రకాల పోషకాహారాలు అందుబాటులో ఉన్నాయని 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎం.ఎల్.ఎస్.కాంతం అన్నారు. వాటిని వినియోగించుకుని ఆరోగ్య సంరక్షణపై శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కిశోర బాలికల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా 68, 69వ వార్డు పరిధిలోని అంగన్‌వాడీ సెంటర్ల టీచర్ల ఆధ్వర్యంలో పాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు గల ఆహారాలపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎస్‌కేలు గాయత్రి, ఎం.పూర్ణిమ, అంగన్‌వాడీ టీచర్లు దుర్గాబాయి, సీత, పుష్పలత, మణి, కృష్ణవేణి, సుజాత, నూకరత్నం, పాఠశాల ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.



అక్కిరెడ్డిపాలెం హైస్కూల్‌లో పోషకాహారాలపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

ఘనంగా హిందీ దినోత్సవం



మింది జెడ్పీ హైస్కూల్లో మాట్లాడుతున్న హెచ్‌ఎం ఆంజనేయ



నడుపూరు హైస్కూల్లో విద్యార్థినుల నృత్య రూపకం

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు మింది జిల్లా పరిషత్ హైస్కూల్‌లో హిందీ దివస్‌ను గురువారం ఘనంగా నిర్వహించారు. హిందీ భాష ప్రాధాన్యతను హెచ్‌ఎం పి.వి.ఎస్.ఎస్.ఎస్.ఆంజనేయ వివరించారు. భారతదేశంలో రాజభాషగా హిందీకి ప్రాధాన్యత కల్పించారన్నారు. విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే ప్రణాళిక ప్రకారం చదువును కొనసాగించాలని సూచించారు. మాజీ రాష్ట్రపతి ఎ.పి.జె.అబ్దుల్ కలాం చెప్పినట్లు కలలు కని వాటిని సార్థకం చేసుకోవాలన్నారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించాలని, వారి ఆకాంక్షలను నెరవేర్చాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన హిందీ గీతాలు, నృత్యాలు అలరించాయి. హిందీ ఉపాధ్యాయులు పి.ఎ.వి.రమణ, టి.మధురిమ, ఉపాధ్యాయులు రమణ, మురళీ ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

నడుపూరు హైస్కూల్లో..

పెదగంట్యాడ: జాతీయ అధికార భాషగా దేశాన్ని సమైక్యం చేసిన ఘనత హిందీ భాషకు దక్కిందని నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాచకొండ శ్రీనివాస్ అన్నారు. హిందీ దినోత్సవాన్ని పురస్కరించుకుని నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ హిందీ భాష ప్రాధాన్యాన్ని వివరించారు. అనంతరం వివిధ సాహిత్య రూపకాలను ప్రదర్శించారు, బాల గీత్ నృత్య రూపకం ఆకట్టుకుంది. నాటికలు అలరించాయి. హిందీ భాషకు సంబంధించిన బోధనోపకరణాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నారాయణరావు, రజని, శాంతి కుమారి, శ్యామల,వరలక్ష్మి, తులసి పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో..

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో జరిగిన హిందీ దినోత్సవంలో హెచ్‌ఆర్ సీజీఎం జి.గాంధీ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు మాధ్యమం పాఠశాల విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం–కెరియర్ గైడెన్స్‌పై గురువారం రాష్ట్ర ప్రభుత్వ యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉన్నత విద్యా అవకాశాలు, వ్యక్తిత్వ వికాసం, భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దుకునే మార్గాలపై నిపుణులు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థుల సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కె.సలోమి, యువజన సర్వీసుల శాఖ అసిస్టెంట్ మేనేజర్ బి.ఎస్.ప్రకాశరావు, సూపరింటెండెంట్ ఎం.కె.సన్యాసిరావు, సీనియర్ అసిస్టెంట్ ఎస్.వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



వ్యక్తిత్వ వికాస పుస్తకం విడుదల చేస్తున్న అధికారులు

జాబ్‌మేళాకు విశేష స్పందన

ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించినట్లు యూనివర్సిటీ ఎంప్లాయ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ అండ్ గైడెన్స్ బ్యూరో కె.దొరబాబు తెలిపారు. ఇంటర్వ్యూలకు హాజరైన వారిలో 68 మంది తొలిదశలో ఎంపికయ్యారని పేర్కొన్నారు. మౌఖిక ఇంటర్వ్యూలు జరిపి తుది ఫలితాలు త్వరలో వెల్లడిస్తామన్నారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి



అప్పలరాజు (ఫైల్)

కూర్మన్నపాలెం: కూర్మన్నపాలెం పరిధి రాజీవ్‌నగర్ వద్ద ట్రాక్టర్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందారు. ఘటనకు సంబంధించి దువ్వాడ సీఐ తెలిపిన వివరాలివి.. గల్లవానిపాలెం ప్రాంతానికి చెందిన యలమశెట్టి అప్పలరాజు(48) కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఎప్పటిలాగే అప్పలరాజు గురువారం ఉదయం సైకిల్‌పై పనికి వెళ్తుండగా.. రాజీవ్‌నగర్‌లోని ఏపీఎం స్కూల్ వద్ద వేగంగా వస్తున్న ట్రాక్టర్ బలంగా ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలపాలైన అప్పలరాజును వెంటనే కేజీహెచ్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. కేజీహెచ్‌లో అతడిని పరీక్షించిన వైద్యులు మరణించినట్లు ధ్రువీకరించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

యూపీహెచ్‌సీకి స్టీల్ కుర్చీల అందజేత



మూడు సీట్ల ఎంఎస్ చైర్లను అందిస్తున్న లుపిన్ కంపెనీ ప్రతినిధులు

అగనంపూడి: లుపిన్ ఫార్మా కంపెనీ లిమిటెడ్ లంకెలపాలెంలోని వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రానికి రూ.65వేల విలువైన మూడుసీట్ల ఎంఎస్ కుర్చీలు 8 అందించింది. ఈ సందర్భంగా లుపిన్ ఫార్మా కంపెనీ యాజమాన్య ప్రతినిధి రాజేష్ మాట్లాడుతూ లుపిన్ కంపెనీ సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా 25 మంది రోగులు కూర్చునేందుకు వీలుగా 8 కుర్చీలు అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దివ్యలత, లుపిన్ డీజీఎం (హెచ్‌ఆర్) ఎన్.శ్రీనివాసరావు, సీఎస్‌ఆర్ మేనేజర్ డి.వెంకటనారాయణ, అడ్మిన్ ఇన్‌చార్జ్ జె.అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలతో స్టీల్‌ప్లాంట్ పురోభివృద్ధి



శాంప్లింగ్‌సా ప్రారంభిస్తున్న సీజీఎం స్వామి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల నూతన ఆవిష్కరణలతో స్టీల్‌ప్లాంట్ పురోభివృద్ధి చెందుతుందని స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్) ఎన్.వి.స్వామి, సీజీఎం (మెయింటెనెన్స్) యు. శ్రీధర్ అన్నారు. మీడియం మర్చంట్ మిల్ విభాగంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఉద్యోగులు కూలింగ్ బెడ్ ఏరియాలో నూతనంగా తయారు చేసిన శాంప్లింగ్ సా ను ఎన్.వి.స్వామి, ఫినిషింగ్ ఏరియాలో ఉద్యోగులు తయారు చేసిన ఆయిల్ శుద్ధి, స్టోరేజ్ పద్ధతిని యు. శ్రీధర్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ కొత్త ఆవిష్కరణలు సంస్థకు ఆర్థికంగా, ఉత్పత్తిపరంగా ఎంతో సహాయపడతాయన్నారు. కార్యక్రమాల్లో విభాగాధిపతి సైబాల్ సేన్, అధికారులు కృష్ణప్రసాద్, తివారి, పి.సి.పాల్, మనోజ్ ఓరాన్, ఎం.చంద్రశేఖర్, వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు దేముడు, ధనరాజు, కె.ఆర్.కె. రాజు, వై.వి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

జై ఆంధ్ర ఉత్తరాంధ్ర జేఏసీ చైర్మన్‌గా సంపూర్ణం



సంపూర్ణం

ఉక్కునగరం: జై ఆంధ్ర ఉత్తరాంధ్ర జిల్లాల జేఏసీ చైర్మన్‌గా స్టీల్ ఐఎన్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ డి.సంపూర్ణం నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు గురువారం రాష్ట్ర కమిటీ నుంచి ఉత్తర్వులు అందాయి. ఉత్తరాంధ్ర జిల్లాల జేఏసీ అధ్యక్షుడిగా దేవరపల్లి మహేష్‌ను, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జయబాబును నియమించారు.

945వ రోజుకు 'ఉక్కు' రిలే దీక్షలు



దీక్ష శిబిరం వద్ద నినాదాలు చేస్తున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ప్రతిపాదనను కేంద్రప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 945వ రోజు, గురువారం సంస్థకు చెందిన సీఎంఎం విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ ఆలోచనను వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఆక్సిజన్ ప్లాంట్‌ను ఉక్కు యాజమాన్యమే నడపాలి



స్టీల్‌ప్లాంట్ యుటిలిటీస్ విభాగాధిపతి రవికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని నూతన ఆక్సిజన్ ప్లాంట్‌ను యాజమాన్యమే నడపాలని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె. అయోధ్యరామ్ డిమాండ్ చేశారు. సీఐటీయూ మిత్రపక్షాల ఆధ్వర్యంలో గురువారం యుటిలిటీస్ విభాగం కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ధర్నాలో ఆయన మాట్లాడుతూ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 944 రోజులుగా ఉద్యమం జరుగుతుందన్నారు. దీనికి భయపడి కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో స్థానిక స్టీల్ యాజమాన్యం విభాగాల వారీగా అమ్మాలని ప్రయత్నిస్తే తీవ్ర ప్రతిఘటన తప్పదన్నారు. విభాగాధిపతి ఎస్.ఆర్.రవికి వినతిపత్రం అందజేశారు. ధర్నాలో ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడారు. వివిధ మిత్రపక్షాలు, ఇతర కార్మిక సంఘాల నాయకులు డి.వి. రమణారెడ్డి, సురేష్‌బాబు, సన్యాసిరావు, దాలినాయుడు, వి. శ్రీనివాస్, బి. రమణ, పరంధామయ్య ధర్నాకు సంఘీభావం తెలిపారు.

ఇంటక్ ఆధ్వర్యంలో..

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని ఆక్సిజన్ ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రతిపాదన ఉపసంహరించుకోవాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు కోరారు. నాయకులు గురువారం స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్) ఎన్‌వి. స్వామిని కలిసి వినతిపత్రం అందజేశారు. స్టీల్ ప్లాంట్ విస్తరణకు అనుగుణంగా కొత్త ఆక్సిజన్ ప్లాంట్ నిర్మించారన్నారు. స్టీల్‌ప్లాంట్ పూర్తి సామర్థ్యానికి కొత్త ఆక్సిజన్ ప్లాంట్ ఆవశ్యకమన్నారు. ఉక్కు యాజమాన్యం ఆధ్వర్యంలోనే నడపాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు సీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, ఎస్.ఎ.నాయుడు, ఆర్.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.